గోదావరి.. ఇప్పుడిక ఎడారి!

కాంగ్రెస్ సర్కారు తీరుతో అంతా తారుమారు • కాళేశ్వరం ప్రాజెక్టుతో అప్పుడు పంటలకు పుష్కలంగా నీరు

ఇప్పుడు వందల కిలో మీటర్లు ఖాళీగా దర్శనమిస్తున్న గోదావరి • యాసంగి పంటల సాగుపై అన్నదాతల్లో ఆందోళన

వరంగల్, ఫిబ్రవరి 9(నమస్తే తెలంగాణ ప్రతినిధి)/పెద్దపల్లి, (నమస్తే తెలంగాణ): గోదావరి... తెలంగాణకు జీవనది. తాగునీటికి, పంటలకు, కరెంటు తయారీకి, పరిశ్రమలకు ఇదే జీవనాధారం. వానకాలంలోనే పుష్కలంగా పారే గోదావరిపై తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టుతో జీవనదిగా మారగా... కాంగ్రెస్ సర్కారు కక్షపూరిత తీరుతో ఇప్పుడు జలంలేని ఎడారిగా మారిపోయింది. నాటి సీఎం కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించిన తర్వాత ఎల్లంపల్లి నుంచి సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ, సమ్మక్క బరాజ్ (దేవాదుల) వరకు దాదాపు 130 కిలో మీటర్ల మేరకు నది ఎండకాలంలోనూ గోదావరి నిండుగా కళకళలాడేది. గోదావరి నదిలోని నీటితో తెలంగాణలోని అత్యధిక ప్రాంతంలో భూగర్భ జలాలు సమృద్ధిగా ఉండేవి. యాసంగి పంటలకు పుష్కలంగా నీళ్లు పారేవి. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత సాగునీటిపై అవగాహన లోపం, నిర్వహణ కారణంగా వానకాలం పంటలకూ భరోసా లేకుండా పోతున్నది. ముఖ్యంగా ఎల్లంపల్లి నుంచి అన్నారం వరకు 64 కిలో మీటర్ల మేర ఒక్క చుక్క నీరు కనిపించడం లేదు. అన్నారం దిగువన మేడిగడ్డ వరకు 16 కిలో మీటర్ల వరకు ఇదే పరిస్థితి దాపురించింది. అలాగే మేడిగడ్డ నుంచి 50 కిలో మీటర్ల దిగువన గంగారం వద్ద దేవాదుల పంప్‌హౌస్‌ఉండగా, దాని నుంచి 5 కిలోమీటర్ల దిగువన సమక్క బరాజ్ ఇప్పుడు గోదావరి నదిలా కాకుండా ఇసుకతిన్నెగా కనిపిస్తున్నది.

జయశంకర్ భూపాలపల్లి జిల్లా అన్నారం బరాజ్ వద్ద ఎడారిని తలపిస్తున్న గోదావరి

సాగునీటి కోసం అష్టకష్టాలు..

గోదావరిలో నీళ్లు లేకపోవడంతో దీని సమీపంలోని వందల కిలోమీటర్ల ప్రాంతంలో భూగర్భ జలాలు సగటున 2 మీటర్ల లోతుల్లోకి వెళ్లాయి. ఎండల తీవ్రత ఇలాగే ఉంటే మరో రెండు వారాల్లోనే బోర్లు పూర్తిగా ఎండిపోయే పరిస్థితి ఉంటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అంతేకాకుండా గోదావరి నదితో పాటు కాళేశ్వరం ప్రాజెక్టు ఆయకట్టు ప్రాంతాల్లోని బోర్లు, బావులు, చెరువులు, మానేరు, చలివాగుల్లో నీళ్లు కనిపించడం లేదు. కాళేశ్వరం ప్రాజెక్టు మొదలైనప్పటి నుంచి ఇప్పటి వరకు సాగునీటికి ఇంతటి దుర్భర పరిస్థితి ఎప్పుడూ రాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బీఆర్ఎస్ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టుతో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఆయకట్టుకు నీరు అందేది. ఈ ప్రాజెక్టులోని డీబీఎం 38 కాల్వ కింద ఆరువేల ఎకరాలు సాగయ్యేది. ఇప్పుడు ఇక్కడకు నీళ్లు అసలే రావడం లేదు. నీటి వనరులు లేకపోవడంతో రైతులు పంటలను రక్షించుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు.

సాకులతో కాళేశ్వరంపై దెబ్బ..

మేడిగడ్డ బరాజ్‌లో 8 బ్లాకులు, 85 గేట్లు ఉన్నాయి. ఏడో బ్లాకులో ఒక్క 20వ పిల్లర్‌ను సాకుగా చూపి కాంగ్రెస్ ప్రభుత్వం బరాజ్‌ను పక్కన పెట్టింది. ఎన్‌డీఎస్ఏ రిపోర్టు రావడం లేదనే సాకుతో వాయిదా వేస్తూ వస్తుంది. అయితే మేడిగడ్డ బరాజ్‌లో 16.17 టీఎంసీల నీటి సామర్థ్యం ఉన్నది. ఇక్కడ నీటిని నిల్వ చేయకపోవడంతో 3.800 టీఎంసీ నీరు కిందికి వృథాగా పోతున్నది. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏటా 60 టీఎంసీల నుంచి 65 టీఎంసీల నీటిని రైతులకు సాగునీరు అందించేది. కన్నెపల్లి పంప్ హౌస్ నుంచి అన్నారం పంప్‌హౌస్‌కు, అక్కడి నుంచి సుందిళ్లకు, అక్కడి నుంచి ఎల్లంపల్లికి నీటిని పంపింగ్ చేసుకునే అవకాశం ఉన్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో రైతాంగం కరువు కోరల్లో చిక్కుకుంటున్నది. అన్నారం బరాజ్‌కు అన్ని రకాల పరీక్షలు పూర్తి చేశారు. తెలంగాణలోని రైతులు, వ్యవసాయ రంగం బాగు కోసం రాష్ట్ర ప్రభుత్వం నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్ఏ) అనుమతి తీసుకుంటే అన్నారం బరాజ్ నుంచి నీటి పంపింగ్ జరిగేది. ఇలా చేయడం వల్ల కనీసం 3 టీఎంసీల నీటిని లిఫ్టు చేసుకునే వీలుందని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు.

ఎల్లంపల్లిలో 15 టీఎంసీల నీరు నిలువ

పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం ఎల్లంపల్లి వద్ద గల శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో 20.17 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యానికి గాను 15 టీఎంసీల నీరు నిలువ ఉండటంతో ఎల్లంపల్లి ఎగువన 7-8 కిలో మీటర్ల వరకు నీరు నిలువ ఉన్నది. ఆ జలాలను హైదరాబాద్ తాగునీటి అవసరాలకు, పెద్దపల్లి జిల్లాలోని పారిశ్రామిక అవసరాలైన ఎన్టీపీసీ, ఆర్ఎఫ్‌సీఎల్, రామగుండం థర్మల్ పవర్ ప్రాజెక్టులకు అందిస్తున్నారు. ఎల్లంపల్లి దిగువన నీటి పాయలు పెద్దగా లేకపోవడంతో చిన్నపాటి నీటి పాయలే దర్శనమిస్తున్నాయి. గతంలో సుందిళ్లలోని పార్వతీ బరాజ్ గేట్లు వేసి నీటిని నిలువ చేసి ఎత్తిపోతలు నిర్వహించడం వల్ల సుందిళ్ల బ్యాక్ వాటర్ ఏరియాలోని 32 కిలో మీటర్ల దూరం తీర గ్రామాలైన సిరిపురం, బెస్తపల్లి, జల్లారం, సింగిరెడ్డిపల్లి, సుందిళ్ల, ముస్త్యాల, జనగామ, గోదావరిఖని, మేడిపల్లి, లింగాపూర్, పెద్దంపేట, రాయదండి, గోలివాడ, అంతర్గాం వరకు గోదావరినది నిండుకుండలా ఉండేది. సుందిళ్ల దిగువన మహదేవపూర్ మండలం అన్నారం వద్ద అన్నారం, సరస్వతీ బరాజ్ నిర్మించడంతో అన్నారం బరాజ్ ఎగువన 34 కిలో మీటర్ల దూరం తీర గ్రామాలైన అన్నారం, ఆరెంద, వెంకటాపూర్, మల్లారం, భట్టుపల్లి, ఖాన్‌సాయిపేట, ఖానాపూర్, మంథని, ఉప్పట్ల, పోతారం, నాగారం, గుంజపడుగు, సిరిపురం వరకు బరాజ్ నీటితో నిండుకుండను తలపించేది. అదే విధంగా మేడిగడ్డ వద్ద లక్ష్మీ బరాజ్‌ను నిర్మించి అక్కడి గేట్లను మూయడం వల్ల ఎగువన 34 కిలో మీటర్ల దూరం తీర గ్రామాలైన సూరారం, బెగ్లూర్, ఎలికేశ్వరం, బొమ్మాపూర్, మహదేవపూర్, ఎడపల్లి, కుదురుపల్లి, బీరసాగర్, కన్నెపల్లి, కాళేశ్వరం, కుంట్లెం, పల్గుల, మద్దులపల్లి, నాగెపల్లి, సండ్రువల్లి, అన్నారం వరకు గోదావరినది జలకళను తలపించేది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ నిర్వాకంతో వంద కిలోమీటర్ల గోదావరి తీరం నీళ్లలేక ఎడారిని తలపిస్తున్నది. మేడిగడ్డ ఎగువ గోదావరి నుంచి ఎల్లంపల్లి వరకు గల గోదావరి నదిలో నీటి నిల్వలు పూర్తిగా పోయి, చిన్నపాటి పాయలు దర్శనమిస్తున్నాయి.

కాళేశ్వరం ప్రాజెక్టు ఉపయోగంలో ఉన్న సమయంలో కళకళలాడుతున్న గోదావరి

పండుతదో ఎండుతదో

మానేరు వాగు దగ్గర నాకు ఉన్న నాలుగు ఎకరాల్లో వరి వేసిన. మానేరు మొత్తం ఎండింది. కెనాల్ నీరు అత్తలేవు. నాట్లప్పుడే నీళ్లు అందుతలేవు. ఎట్ల కొసెళ్తదో అనే భయంగా ఉంది. బావులు, బోర్లలో నీళ్లు లేవు. బావులు మళ్లీ డబ్బులు పెట్టి పూడిక తీత్తే ఏమైనా నీళ్లత్తయో సూడాలె. మాకు మానేరు, చలివాగులో నీళ్లు ఉన్నన్నీ రోజులు రంది లేకుండా ఉన్నం. ఇప్పుడు చలివాగు, మానేరు ఎండింది. ఏం చేయాలో తోత్తలేదు. గతంలో ఎప్పుడూ ఇట్ల కాలే. ఇంకో నెల రెండు నెలలు అయితే ఇంకా గోస ఎక్కువ అయితది.

– నేరెళ్ల సునీల్, రైతు, వెంకట్రావ్‌పల్లి, టేకుమట్ల మండలం, భూపాలపల్లి జిల్లా

ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టులో పడిపోతున్న నీటిమట్టం

కర్ణాటక కరుణిస్తేనే.. యాసంగి

- 'జూరాల' ఆయకట్టు సాగుపై కమ్ముకున్న నీలినీడలు
- పడిపోతున్న నీటిమట్టం
- కన్నడ సీఎంకు విన్నవించిన మంత్రి, ఎమ్మెల్యేలు
- ఆందోళనలో రైతులు

గద్వాల, ఫిబ్రవరి 9 : ఉమ్మడి పాలమూరు జిల్లా వరప్రదాయిని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు. యాసంగిలో డ్యాం ఆయకట్టు కింద రైతులు వివిధ పంటలు సాగుచేశారు. జూరాలపైనే ఆయకట్టుతో పాటు నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, భీమా ఎత్తిపోతల పథకాలు ఆధారపడి ఉన్నాయి. డ్యాంలో నీటిమట్టం తగ్గుతుండటంతో పంటల చివరి నాటికి నీళ్లు అందుతాయా? అన్న అనుమానాలు రైతుల్లో వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం హైదరాబాద్‌లో యాసంగికి సంబంధించి ఆయా ప్రాజెక్టుల నీటి లభ్యత మేరకు సాగునీటి ప్రణాళిక విడుదల చేసింది. అందులో భాగంగా జోగుళాంబ గద్వాల జిల్లాలో ఉన్న జూరాల ప్రాజెక్టులో ఉన్న నీటి లభ్యత ఆధారంగా వారబంది మేరకు నీటి విడుదల చేయాలని అధికారులు నిర్ణయించారు. అందులో భాగంగా రైతులు యాసంగిలో కేవలం ఆరుతడి పంటలే వేసుకోవాలని సూచించినప్పటికీ ఎక్కువ భాగం వరి వేశారు. పంటకు నీటి లభ్యత అవసరం ఉండటంతో సందిగ్ధం నెలకొన్నది.

డెడ్‌స్టోరేజీకి జూరాల

జూరాల పూర్తిస్థాయి నీటిమట్టం 9.6 టీఎంసీలు. ప్రాజెక్టు డెడ్ స్టోరేజీ వచ్చేసి 3.7 టీఎంసీలు. ప్రస్తుతం డెడ్ స్టోరేజీ నీటితో కలుపుకొని 5.287 నమోదైంది. ఈ నీటినే సాగునీటికి విడుదల చేయడంతోపాటు వేసవి ముగిసే వరకు తాగునీటి అవసరాల కోసం 0.4 టీఎంసీలు వాడుకోవాల్సి ఉన్నది.

కర్ణాటక దయతలిస్తేనే..

సాగు, తాగునీటి విషయంలో కర్ణాటక ప్రభుత్వం కరుణిస్తే తప్ప.. ఈ యాసంగిలో గట్టెక్కే పరిస్థితులు కనిపించడం లేదు. రోజురోజుకూ జూరాల డ్యాంలో నీటిసామర్థ్యం తగ్గుతుండటంతో మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు కృష్ణమోహన్‌రెడ్డి, శ్రీహరి, మధుసూదన్‌రెడ్డి, అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ కర్ణాటకకు వెళ్లారు. అక్కడి సీఎం సిద్ధరామయ్య, ఉపముఖ్యమంత్రి శివకుమార్‌ను కలిశారు. ఉమ్మడి పాలమూరు జిల్లాకు ఐ దు టీఎంసీల నీరు వదిలితే ఈ యాసంగిలో సాగు, తాగునీటి అవసరాలు తీరుతాయని విన్నవించారు. అందుకు వారు సానుకూలంగా స్పందించినట్టు మంత్రి, ఎమ్మెల్యేలు తెలిపారు. కన్నడ సీఎం ఇచ్చిన మాట మేరకు నీటిని విడుదల చేస్తే ఇబ్బందులు ఉండవు.. లేకుంటే ఉమ్మడి జిల్లా ప్రజలకు తాగు, సాగునీటికి ఇబ్బందులు తప్పవు.

టీచర్‌పై పోక్సో కేసు

సూర్యాపేట టౌన్, ఫిబ్రవరి 9 : సూర్యాపేటలో ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు మహిళతో సహజీవనం చేస్తున్నాడు. సదరు మహిళకు ఇద్దరు కుమార్తెలుండగా తల్లి లేని సమయంలో వారిపై లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ మేరకు తల్లి ఫిర్యాదు చేయగా సదరు ఉపాధ్యాయుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. ప్రస్తుతం నిందితుడు పరారీలో ఉన్నాడని, సోమవారం బాధితులకు వైద్య పరీక్షలు చేయించనున్నట్టు తెలిపారు.

పూల రవీందర్‌కు 'ఎట్‌గ్రీవ' మద్దతు

హైదరాబాద్, ఫిబ్రవరి 9 (నమస్తే తెలంగాణ): నల్లగొండ-ఖమ్మం-వరంగల్ నియోజకవర్గ టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలో నిలిచిన పూల రవీందర్‌కు ఎట్‌గ్రీవ(ఆల్ తెలంగాణ గవర్నమెంట్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్) మద్దతు ప్రకటించింది. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కూకట్ల యాదయ్య ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

పీఆర్టీయూ అభ్యర్థులకు ఆరు సంఘాలు..

పీఆర్టీయూటీఎస్ అభ్యర్థులు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, మంగ మహేందర్‌రెడ్డికి ఆరు సంఘాలు మద్దతు పలికాయి. ఈ మేరకు ఆదివారం నారాయణగూడలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయా సంఘాలు తమ మద్దతు లేఖలను అందజేశాయి. మద్దతు తెలిపిన సంఘాల్లో తెలంగాణ స్టేట్ గెజిటెడ్ హెడ్మాస్టర్ల సంఘం, రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్తు, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ తెలంగాణ స్టేట్, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ తెలంగాణ, ఉర్దూ టీచర్స్ అసోసియేషన్, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ ఉన్నాయి.

భరోసాకు మళ్లీ బ్రేక్!

మొదటిపేజీ తరువాయి...

పెట్టుబడిసాయం అందజేశారు. ఈ లెక్కన రైతులకు ప్రభుత్వం ఇంకా రూ.7,274 కోట్లు బాకీ పడింది. ఈ బాకీ ఎప్పటి వరకు తీర్చుతుందో స్పష్టత లేదు. అసలు తీర్చుతుందో, ఎగ్గొడుతుందోననే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వారం, పది రోజులకోసారి కొంతమంది రైతులకు రైతు భరోసా ఇస్తూపోతే యాసంగి సీజన్ పూర్తయి... వానకాలం మొదలైనా పంపిణీ పూర్తికాదనే విమర్శలు వస్తున్నాయి. ఎంత మంది రైతులకు, ఎప్పుడు, ఎంత విస్తీర్ణానికి ఇస్తున్నారనే వివరాలను ప్రభుత్వం ఇప్పటివరకు వెల్లడించలేదు. యాసంగి రైతుభరోసా ఎప్పటికి పూర్తవుతుందో తెలియని పరిస్థితి నెలకొన్నది.

ఇస్తారో.. ఎగ్గొడతారో?

రైతుభరోసా కోసం రాష్ట్రవ్యాప్తంగా రైతులు కోటి కళ్లతో ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే యాసంగి పంటల సాగు పూర్తయింది. పెట్టుబడి సాయం అందుతుందనే ఆశతో రైతులు అప్పులు తీసుకొచ్చి పెట్టుబడులు పెట్టారు. కానీ, కాంగ్రెస్ సర్కారు రైతుల ఆశలపై నీళ్లు చల్లుతూ ఇదిగో.. అదిగో అంటూ ప్రకటనలకే పరిమితమైంది. దీంతో అప్పులు తీసుకొచ్చిన రైతులు వాటిని చెల్లించే మార్గం లేక నానా తంటాలు పడుతున్నారు. దీంతో రైతులు సర్కారుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంటలు వేసేటప్పుడు ఇవ్వాల్సిన సాయం.. కోతలు దగ్గరపడుతున్నా ఇవ్వడం లేదంటూ మండిపడుతున్నారు. ఇప్పటికే రైతు భరోసాపై మాట తప్పిన కాంగ్రెస్ సర్కారు.. అరకొర సాయాన్ని కూడా ఇస్తుందో, లేదోననే సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల వేళ ఎకరానికి రూ.15 వేలు ఇస్తామంటూ హామీ ఇచ్చి ఇప్పుడు రూ.12 వేలే ఇస్తామని మాటతప్పిన విషయాన్ని రైతులు గుర్తుచేస్తున్నారు. వానకాలం మాదిరిగానే యాసంగికి సైతం రైతు భరోసా ఎగ్గొడుతుందేమోనని చర్చించుకుంటున్నారు.

మధ్యవర్తిత్వానిదే భవిత

వలంటీర్ల శిక్షణ కార్యక్రమంలో ఏసీజే సుజయ్‌పాల్

హైదరాబాద్, ఫిబ్రవరి 9 (నమస్తే తెలంగాణ): భవిష్యత్తు మధ్యవర్తిత్వానిదేనని, కక్షిదారులకు సత్వర న్యాయం అందించేందుకు కృషి చేయాలని కమ్యూనిటీ మీడియేటర్లకు ఏసీజే, టీఎస్ ఎల్ ఎస్ ఏ ప్యాట్రన్ ఇన్ చీఫ్ జస్టిస్ సుజయ్ పాల్ సూచించారు. సోమాజిగూడ సంస్కృతి రాజ్‌భవన్ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం నుంచి మూడు రోజుల పాటు జరగనున్న శిక్షణ కార్యక్రమాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ నెల 12 వరకు జరిగే శిక్షణ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని వాలంటీర్లకు సూచించారు. న్యాయస్థానాలపై పెండింగ్ కేసుల భారాన్ని తగ్గించడంలో మధ్యవర్తిత్వం ప్రధాన భూమిక పోషించనున్నదని అభిప్రాయపడ్డారు. మూడు రోజుల పాటు 20 గంటలు శిక్షణ ఇవ్వనున్నట్టు టీఎస్ ఎల్ ఎస్ ఏ సభ్య కార్యదర్శి సీహెచ్ పంచాక్షరి తెలిపారు. కమ్యూనిటీ సెంటర్లు ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు. శిక్షణ కార్యక్రమానికి హైదరాబాద్‌కు చెందిన 132 మంది వలంటీర్లు హాజరయ్యారు.

మాట్లాడుతున్న ఏసీజే జస్టిస్ సుజయ్‌పాల్

ట్రోఫీతో సీజే లెవన్ జట్టు సభ్యులు

సీజే లెవన్‌దే విజయం

హైదరాబాద్, ఫిబ్రవరి 9 (నమస్తేతెలంగాణ): ఉప్పల్‌లో స్టేడియంలో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ (ప్రెసిడెంట్ లెవన్) జట్టుపై న్యాయమూర్తుల(ప్రధాన న్యాయమూర్తి లెవన్) జట్టు 93 పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన సీజే లెవన్ జట్టు నిర్ణీత 16 ఓవర్లలో 167 పరుగులు చేసింది. ప్రెసిడెంట్ లెవన్ జట్టు 74 పరుగులకే ఆలౌట్ అయ్యింది. జస్టిస్ నర్సింగ్‌రావు నందికొండ, జస్టిస్ మధుసూధన్ రావు బౌలింగ్, బ్యాటింగ్‌లో ప్రతిభ కనబరిచారు. జస్టిస్‌సురేందర్ మ్యాన్‌ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచారు. యాక్టింగ్ చీఫ్ జస్టిస్ సుజయ్‌పాల్‌మ్యాచ్‌ను ప్రారంభించారు. జస్టిస్ కే లక్ష్మణ్, జస్టిస్ మాధవి దేవి, జస్టిస్ ఎన్‌వీ శ్రావణ్ కుమార్, జస్టిస్ సీవీ భాస్కర్ రెడ్డి, జస్టిస్ శ్రీనివాస్‌రావు, హెచ్‌సీఏఏ అధ్యక్షుడు ఏ రవీందర్‌రెడ్డి, కార్యదర్శులు శాంతిభూషణ్, సంజీవ్‌రెడ్డి, అదనపు కార్యదర్శి నవీన్ పాల్గొన్నారు.

డ్రైవింగ్ లైసెన్స్‌ల జారీకి కొత్త టెక్నాలజీ

- 21 కేంద్రాల్లో ఆటోమేటెడ్ డ్రైవింగ్‌టెస్ట్ ట్రాక్‌ల ఏర్పాటు

హైదరాబాద్, ఫిబ్రవరి 9 (నమస్తే తెలంగాణ) : డ్రైవింగ్ సరిగా నేర్చుకోకుండానే పలువురు వాహనదారులు అడ్డదారిలో ఏజెంట్ల ద్వారా లైసెన్సులు పొందుతున్నారు. ఫలితంగా రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. వీటికి చెక్ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతున్నది. అందులో భాగంగా తొలి దశలో 21 ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌లను ఏర్పాటుచేయాలని నిర్ణయించింది. వీటి ఏర్పాటుతో మానవ ప్రమేయం ఉండదు. పరీక్షకు హాజరైన వ్యక్తికి డ్రైవింగ్ వస్తుందా? రావట్లేదా? లైసెన్సు ఇవ్వాలా? వద్దా? అనేది సంబంధిత సాఫ్ట్ వేరే నిర్ణయిస్తుంది. పరీక్ష కోసం వచ్చే వారి డ్రైవింగ్‌ను పరిశీలించడానికి ట్రాక్‌లలో కెమెరాలు బిగిస్తారు. వీటి ద్వారా నిర్దేశిత సమయంలో పరీక్ష పూర్తయ్యిందా లేదా? రెడ్ సిగ్నల్ దగ్గర ఆగారా లేదా? ఇలా ప్రతి ప్రక్రియను చిత్రీకరిస్తారు. డ్రైవింగ్ టెస్ట్‌కు దరఖాస్తుదారే వచ్చాడా? ఇతరులు వచ్చారా? అనేది కూడా ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ ద్వారా గుర్తిస్తారు. 21 ప్రాంతాల్లో ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌లను ఏర్పాటుచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇటీవలే మంత్రి పొన్నం అధికారులతో సమీక్షించారు.

వేగంగా పడిపోతున్న భూగర్భ జలాలు

- నిర్మల్ జిల్లాలో నెల రోజుల్లో మీటరున్నర లోతుకు
- ఎండలు ముదిరితే బోర్లు వట్టిపోయే అవకాశం
- యాసంగి పంటలకు తప్పని సాగు నీటి కష్టాలు

నిర్మల్, ఫిబ్రవరి 9 (నమస్తే తెలంగాణ) : ఎండాకాలం రాకముందే భూగర్భంలో ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. భూగర్భ జలాలు క్రమంగా పాతాళం వైపు పయనిస్తున్నాయి. నెల రోజుల వ్యవధిలోనే మీటరుకుపైగా లోతుకు నీటిమట్టాలు పడిపోయాయి. ఇదీ ఇలాగే కొనసాగితే వచ్చే రెండు, మూడు నెలల్లో బోరుబావులు ఎత్తిపోయి యాసంగిలో వేసిన పంటలకు చివరి దశలో నీరందే అవకాశం లేకుండాపోతుంది. గత జనవరి నెల మొదటి వారంలో జిల్లావ్యాప్తంగా సగటున 6.80 మీటర్ల లోతులో భూగర్భ జలాలు ఉండగా, ప్రస్తుతం 8.20 మీటర్లకు పడిపోయాయి. అంటే కేవలం నెల రోజుల్లోనే దాదాపు 1.5 మీటర్ల లోతుకు నీటి మట్టాలు పడిపోవడం అన్నదాతకు ఆందోళన కలిగిస్తున్నది. ఇప్పుడే పరిస్థితి ఇలావుంటే వచ్చే వేసవిలో భూగర్భ నీటి మట్టాలు గణనీయంగా పడిపోయే అవకాశాలు కనిపిస్తున్నాయి. నిరుడు జనవరిలో ఇప్పటి కంటే కాస్త మెరుగ్గా 7.87 మీటర్ల జిల్లా సగటు నీటిమట్టాలు ఉండేవి. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా దాదాపు 45 వేల వరకు బోరుబావులు ఉన్నట్టు అధికారులు చెప్తున్నారు. ఈ బోరుబావుల కింద అత్యధికంగా వరి సాగు చేస్తున్నారు. దీంతో నీటి వినియోగం బాగా పెరగడంతో భూగర్భ జలాలు వేగంగా పడిపోతున్నాయి. ఈ సారి వానకాలంలో 12 శాతం అధికంగా వర్షపాతం నమోదైనప్పటికీ, యాసంగి సాగు విస్తీర్ణం పెరగడంతో బోరుబావుల ద్వారా నీటి వినియోగం పెరిగింది. సాగు నీటి కోసం రైతులు ఎక్కువగా భూగర్భ జలాలపైనే ఆధారపడటంతో ఈ పరిస్థితి ఉత్పన్నమవుతున్నది. వచ్చే వేసవిని దృష్టిలో ఉంచుకుని నీటి లభ్యత తగ్గితే.. రైతులు మరో కొత్త బోరుకు ప్రయత్నం చేయవద్దని అధికారులు సూచిస్తున్నారు. తాగునీటి అవసరాలకు మాత్రమే కొత్త బోర్లు వేయాలని భూగర్భ జల శాఖ అధికారులు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. భూమిలో నీటి లభ్యతనే లేనప్పుడు కొత్త బోర్లు వేసి ఆర్థికంగా నష్టపోయే బదులు అందుబాటులో ఉన్న నీటితో సాగు విస్తీర్ణాన్ని తగ్గించుకోవాలని సూచిస్తున్నారు. ఇకపై ప్రతినెలా మీటరు నుంచి మీటరున్నర వరకు భూగర్భ జలాలు తగ్గిపోయే అవకాశం ఉండటంతో వచ్చే ఏప్రిల్, మే నెలలో రైతులకు సాగునీటి కష్టాలు తప్పేలా లేవు. సరిగ్గా పంట చేతికొచ్చే సమయంలో నీరందకపోతే పంట లు ఎండిపోయి దిగుబడులపై ప్రభావం చూపే అవకాశం ఉన్నది.

కుంటాల మండలంలోని వెంకూర్ శివారులో భూగర్భ జలాలు తగ్గడంతో బోరుబావి నుంచి వస్తున్న సన్నటి ధార

యాసంగిలో 3 లక్షల ఎకరాల్లో పంటలు..

ఈ యాసంగిలో అన్ని రకాలు కలుపుకొని 3 లక్షల ఎకరాల్లో పంటలు వేయనున్నారు. ఇందులో 1.10 లక్షల ఎకరాల్లో వరి, 1.02 లక్షల ఎకరాల్లో మక్క, 35 వేల ఎకరాల్లో జొన్న, 55 వేల ఎకరాల్లో శనగ పంటలు సాగవుతాయని అంచనా వేశారు. చాలాచోట్ల మక్క, జొన్న, శనగ పంటలను నెల రోజుల క్రితమే వేయడంతో ప్రస్తుతం అవి ఏపుగా పెరిగాయి. ఒక్క వరి మాత్రం ఇప్పుడిప్పుడే నాట్ల దశలో ఉన్నది.

ఆర్టీసీ విలీనాన్ని పూర్తి చేయాలి

- ఎన్నికల హామీలను నెరవేర్చాలి
- ఎండీ సజ్జనార్‌పై విచారణ జరపాలి
- సానుకూల నిర్ణయం తీసుకోకుంటే సమ్మె తథ్యం
- చర్చల నేపథ్యంలో టీఎంయూ స్పష్టీకరణ

హైదరాబాద్, ఫిబ్రవరి 9 (నమస్తే తెలంగాణ): ఎన్నికల సందర్భంగా ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ మజ్దూర్ యూనియన్ (టీఎంయూ) రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఆర్టీసీ జాక్ ఆధ్వర్యంలో సమ్మె నోటీసు ఇచ్చిన యూనియన్లతోపాటు, ఆర్టీసీ యాజమాన్యం సోమవారం చర్చలకు రావాలని కార్మిక శాఖ ఆహ్వానించింది. ఈ నేపథ్యంలో ఆదివారం హైదరాబాద్‌లో టీఎంయూ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా టీఎంయూ అధ్యక్షుడు ఏ రామచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం థామస్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్ కమలాకర్‌గౌడ్, ముఖ్య సలహాదారులు ఎల్ మారయ్య, బీ యాదయ్య మాట్లాడుతూ.. సోమవారం జరిగే చర్చల్లో కార్మికులకు అనుకూలంగా నిర్ణయం తీసుకోకుంటే సమ్మెకు దిగడం తప్పదని హెచ్చరించారు. ప్రభుత్వంలో ఆర్టీసీ విలీన ప్రక్రియను పూర్తిచేయడంతోపాటు 2017, 2021 వేతన సవరణ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీలో కార్మికులపై అధికారుల వేధింపులు తీవ్రమయ్యాయని, పని ఒత్తిడి వల్ల ఎంతో మంది కార్మికులు విధులలోనే ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేయడంతోపాటు వచ్చే పీఆర్సీ పరిధిలోకి చేరుస్తామని, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా అన్ని వసతులు కల్పిస్తామని, ఆర్టీసీ బస్సులను ఆధునీకరిస్తామని ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చలేదని మండిపడ్డారు.

ఆర్టీసీ ప్రైవేటీకరణకు కుట్ర: థామస్‌రెడ్డి

ఆర్టీసీలో ప్రైవేటు ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టి, వాటి నిర్వహణ కోసం డిపోలను కేటాయిస్తున్నారని, తద్వారా ఆర్టీసీని ప్రైవేటీకరించేందుకు ప్రయత్నిస్తున్నారని థామస్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఆర్టీసీని కాపాడుకోవడంతోపాటు పేద, మధ్య తరగతి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించాలన్న సంకల్పంతో మెజార్టీ కార్మిక సంఘాలు జేఏసీగా ఏర్పడి ఉద్యమాలు చేపట్టినా ప్రభుత్వం చలించడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

సమ్మె విచ్ఛిన్నానికి ప్రయత్నాలు

టీఎంయూ ప్రధాన కార్యదర్శి పదవికి రాజీనామా చేసిన అశ్వత్థామరెడ్డి లాంటి కొందరు స్వార్థపరులు ఈ సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని థామస్‌రెడ్డి విమర్శించారు. టీఎంయూ నిధులను దుర్వినియోగం చేసిన అశ్వత్థామరెడ్డి ప్రస్తుతం ఏ యూనియన్‌లో లేరని స్పష్టం చేశారు.

సజ్జనార్ వచ్చాకే సమస్యలు..

ఆర్టీసీ ఎండీగా సజ్జనార్ వచ్చాకే కార్మికులకు సమస్యలు పెరిగాయని థామస్‌రెడ్డి నిప్పులు చెరిగారు. ఆయన హయాంలో 2022 నుంచి ఇప్పటివరకు ఎంత మంది ఆర్టీసీ కార్మికులు చనిపోయారో, ఎంత మంది ఉద్యోగాలు కోల్పోయారో లెక్కచెప్పాలని డిమాండ్ చేశారు. ఔట్‌సోర్సింగ్, కన్సల్టెన్సీ పేరుతో ఆర్టీసీ సొమ్మును దుబారా చేసిన సజ్జనార్.. కొన్ని రకాల చికిత్సల కోసం తార్నాక ఆర్టీసీ దవాఖానకు వస్తున్న రిటైర్డ్ ఉద్యోగుల నుంచి డబ్బు వసూలు చేస్తున్న విషయం నిజం కాదా? అని ప్రశ్నించారు. సజ్జనార్ అక్రమాలపై చట్టపరంగా విచారణ జరిపించి, ఆర్టీసీని కాపాడుకోవాలనే లక్ష్యంతోనే సమ్మె బాట పట్టినట్టు తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న టీఎంయూ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి థామస్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కమలాకర్‌గౌడ్ తదితరులు

చర్చలు విఫలమైతే సమ్మె తేదీలు ఖరారు చేస్తాం: ఆర్టీసీ జేఏసీ

సమ్మె నోటీసులో ప్రస్తావించిన అన్ని డిమాండ్లను పరిష్కరించాల్సిందేనని ఆర్టీసీ జేఏసీ స్పష్టం చేసింది. కార్మిక శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఆర్టీసీ యాజమాన్యానికి, కార్మిక సంఘాలకు మధ్య చర్చలు జరుగనున్న నేపథ్యంలో ఆదివారం జేఏసీ అత్యవసర సమావేశాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు ఈ వెంకన్న, ఎం థామస్‌రెడ్డి, యాదయ్య, మౌలానా, కమలాకర్‌గౌడ్ మాట్లాడుతూ.. ఆర్టీసీ యాజమాన్యంతో జరిగే చర్చల ఫలితాల ఆధారంగా సమ్మెపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఈ చర్చలు విఫలమైతే సమ్మె తేదీలు ఖరారు చేస్తామని స్పష్టం చేశారు.

ఆస్తి కోసం 73 కత్తిపోట్లు!

- పారిశ్రామికవేత్త చంద్రశేఖర జనార్దన్‌రావు దారుణహత్య
- తాతను హత్య చేసిన మనుమడు.. అడ్డువచ్చిన తల్లిపై కూడా 12సార్లు కత్తితో దాడి
- ఏలూరులో నిందితుడి అరెస్టు

హైదరాబాద్,ఫిబ్రవరి 9(నమస్తే తెలంగాణ): ఆస్తి పంపకాల విషయంలో ప్రముఖ పారిశ్రామికవేత్త, వెల్జాన్ గ్రూప్ అధినేత వెలమాటి చంద్రశేఖర జనార్దన్‌రావు (86) ఆయన మనుమడు చేతిలో అత్యంత దారుణంగా హత్యకు గురయ్యాడు. పోలీసుల వివరాల ప్రకారం... వందలకోట్లు ఆస్తులు కలిగి ఉన్న చంద్రశేఖర జనార్దన్‌రావు ప్రముఖ కంపెనీ వెల్జాన్‌కు చైర్మన్‌గా ఉన్నారు. జనార్దన్‌రావుకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. చంద్రశేఖర జనార్దన్‌రావు రెండో కూతురు సరోజ తన తండ్రితో కలిసి హైదరాబాద్‌లో ఉంటోంది. ఆమె భర్త బెంగళూరులో ఉంటుండగా, ఆమె కొడుకు కిలారు కీర్తితేజ అమెరికాలో ఎమ్మెస్ పూర్తి చేశాడు. డ్రగ్స్‌కు బానిసవడంతో కీర్తితేజను ఇండియాకు తీసుకొచ్చారు. ఇటీవల నాలుగుకోట్ల రూపాయల షేర్స్‌ను కీర్తితేజకు చంద్రశేఖర జనార్దన్‌రావు బదిలీ చేయడంతోపాటు తన కంపెనీలో మరో కుమార్తె కొడుకుకు డైరెక్టర్ పోస్ట్ ఇచ్చాడు. తనకు కూడా డైరెక్టర్ పోస్టు కావాలంటూ కీర్తితేజ డిమాండ్ చేయగా జనార్దన్‌రావు అందుకు నిరాకరించాడు. గురువారం సోమాజిగూడలో ఉంటున్న జనార్దన్‌రావు వద్దకు వచ్చిన కీర్తితేజ డైరెక్టర్ పోస్ట్ కోసం గొడవపడ్డాడు. కాసేపటికి తల్లి వంటింట్లోకి వెళ్లగా కీర్తితేజ తనతో తెచ్చుకున్న కత్తితో తాతను 73సార్లు పొడిచాడు. అడ్డుకోబోయిన తల్లిని కూడా12సార్లు కత్తితో పొడిచాడు. కేకలువిని చుట్టుపక్కల వారు వచ్చి ర క్తపు మడుగులో ఉన్న సరోజను దవాఖాన కు తరలించారు. కీర్తితేజను సెక్యూరిటీ గార్డ్ అడ్డుకునేందుకు యత్నించగా చంపుతానం టూ బెదిరించి పారిపోయాడు. విషయం తె లుసుకున్న పోలీసులు కీర్తితేజ కోసం గా లించి ఏలూరు దగ్గర అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.